

సాక్షి బాపట్ల
మంగళవారం । 25 । ఏప్రిల్ । 2023



కంటైనర్ పల్టీ
కొల్లూరు: కరకట్టపై వెళ్తున్న ఓ కంటైనర్ అదుపు తప్పి పల్టీ కొట్టిన ఘటన కొల్లూరు వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఘటనలో ఎవరూ గాయపడలేదు.



నిమ్మకాయల ధరలు
తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.5,600, మోడల్ ధర రూ.4,800 వరకు పలికింది.


కరోనా జీరో

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్


యార్డుకు 1,28,502 మిర్చి బస్తాలు రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,28,502 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,22,259 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 81,646 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రత్తిపాడులో 50.4 మి.మీ వర్షం
కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 50.4 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 1 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... వట్టిచెరుకూరు 15.4 మి.మీ., కాకుమాను 15.2, పొన్నూరు 8.8, చేబ్రోలు 4, గుంటూరు పశ్చిమ 2, దుగ్గిరాల 1.2, గుంటూరు తూర్పులో 1.2 మి.మీ చొప్పున వర్షం పడింది.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 523.10 అడుగుల వద్ద ఉంది. ఇది 154.9888 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 4,940, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 6,740 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2,416 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.40 అడుగుల వద్ద ఉంది. ఇది 31.2203 టీఎంసీలకు సమానం.

115 మంది నైట్ వాచ్‌మెన్‌ల నియామకం
గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని 115 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో రాత్రి కాపలాదారుల నియామకానికి చర్యలు చేపట్టినట్లు డీఈఓ పి.శైలజ సోమవారం చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి నెలకు రూ.6వేల వేతనంపై రాత్రి వేళల్లో కాపలాదారుల నియామకానికి సంబంధించిన ప్రక్రియను ఈనెల 27వ తేదీలోపు పూర్తి చేయాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలను డీఈఓ ఆదేశించారు. పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయా భర్తకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి నియామకం చేపట్టాలని సూచించారు. వీలుకాని పక్షంలో ఎక్స్ సర్వీసు మ్యాన్, స్థానికంగా ఉన్న వ్యక్తిని పేరెంట్ కమిటీ ఆధ్వర్యంలో నియమించాల్సి ఉందని తెలిపారు. నాడు – నేడు ద్వారా ఆధునికీకరించిన ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విలువైన సామగ్రి భద్రత, రక్షణ కోసం ప్రభుత్వం రాత్రి కాపలాదారుల నియామకానికి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.

రామానుజుల వారికి తిరుమంజన సేవ

తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సోమవారం రామానుజుల వారికి తిరుమంజన సేవ నిర్వహించినట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు తెలియజేశారు. భగవత్ రామానుజుల వారి తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో ఉదయం తిరుమంజన సేవ, అలంకరణ, తదుపరి కనకాంబరం పుష్పాలతో సహస్రనామార్చన, అనంతరం తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు.

సమన్వయంతోనే ప్రమాదాల నివారణ

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- 50 బ్లాక్ స్పాట్స్ గుర్తింపు
- ప్రత్యేక కమిటీలు ఏర్పాటు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. రోడ్డు భద్రతపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను జిల్లావ్యాప్తంగా 50 గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అద్దంకి, వేటపాలెం, చీరాల, వేమూరు ప్రాంతాలలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ప్రమాదాలు అధికంగా నమోదవుతున్నట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా, అనుబంధ శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు నివారించడమే కమిటీల బాధ్యత అన్నారు. 2022 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 645 ప్రమాదాలు జరగ్గా, 2023లో ఇప్పటివరకు 118 ప్రమాదాలు నమోదయ్యాయన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాలు జరగకుండా ఇప్పటికే ఏర్పా ట్లు చేశామని జిల్లా అదనపు ఎస్పీ మహేష్ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే కేసు
మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించాలని కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా చేపట్టాలన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 166 కేసులు నమోదయ్యాయన్నారు. బ్రీత్ ఎనలైజర్ యంత్రాలు 17 మాత్రమే ఉండగా, మరో 32 అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన విషయాన్ని అదనపు ఎస్పీ మహేష్ కలెక్టర్‌కు వివరించారు.

ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు
ప్రమాదాలు జరిగిన వెంటనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా వైద్యశాల ఏర్పాటయ్యే వరకు ట్రామా కేర్ సెంటర్ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

50 కిలో మీటర్లకు ఒక విశ్రాంతి ప్రాంతం
చీరాల–రేపల్లె మధ్య 97 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉందని కలెక్టర్ తెలిపారు. ప్రతి 50 కిలో మీటర్లకు ఒకచోట వాహనాల నిలుపుదల, విశ్రాంతి ప్రాంతం ఏర్పాటు చేయాలని అన్నారు. ఏర్పాట్లు చేయకపోవడంపై కలెక్టర్ ఎన్‌హెచ్ఏ అధికారులను ప్రశ్నించారు. బాపట్లకు ఏడు కిలో మీటర్ల దూరంలో ఒకటి ఏర్పాటు చేస్తున్నామని అధికారులు సమాధానం చెప్పగా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

250 బస్సులు నిలుపుదల
15 సంవత్సరాలు దాటిన ప్రభుత్వ వాహనాలను తక్షణమే నిలుపదల చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే 250 ఆర్టీసీ బస్సులను గుర్తించి నిలుపుదల చేశామని ఆర్టీసీ ఆర్ఎం రామారావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ శాఖలన్నింటికి ఉత్తర్వులను పంపాలన్నారు. బాపట్లలో రహదారుల విస్తరణ వేగంగా చేపట్టాలన్నారు. ప్రమాదాలు జరగకుండా సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్టీఓ ఏ.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ విజయమ్మ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ రంజిత్‌బాషా
- స్పందనలో అర్జీల స్వీకరణ


బాధితుడి వివరాలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ శ్రీధర్

బాపట్ల: స్పందన కార్యక్రమంలో వచ్చిన రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్పందన రీ ఓపెన్ కేసులు 60 దాకా ఉన్నాయని, 11 నెలలు గడుస్తున్నా పరిష్కరించలేదని సీపీఓ, డీపీఓపై అసహనం వ్యక్తం చేశారు. వాటిని రెండు రోజుల్లో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు సంబంధించిన 10 అర్జీలను పరిశీలించి పరిష్కరించడానికి స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను తయారు చేయాలని అన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వీలైనంత ఎక్కువ గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, తాగునీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పనిచేసే ఉపాధి హామీ కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం పూట త్వరగా పనులకు వెళ్లి తీవ్ర వడదెబ్బకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో కిరోసిన్ ఆయిల్ వేయాలన్నారు. గ్రామాల్లో దోమల వల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సర్పంచులకు సన్మానం
జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా 13 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రతిభా పురస్కారాలు ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ 13 గ్రామాల సర్పంచ్‌లకు ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్‌నాయక్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, డీఎస్ఓ విలీమ్స్, జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, డీఎంహెచ్ ఓ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీకి 50 పాఠశాలలు ఎంపిక


పీఎం శ్రీకి ఎంపికైన ఈపూరుపాలెం జెడ్పీ హైస్కూల్

బాపట్లఅర్బన్: దేశంలోనే ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఏపీలో విద్యకు తోడ్పాటునందించేందుకు ముందుకొచ్చింది. పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బాపట్ల జిల్లాలో 50 పాఠశాలలను ఎంపిక చేసింది. దీని కోసం జిల్లాలోని అన్ని పాఠశాలలను కేంద్ర ప్రభుత్వ బృందం ఇప్పటికే సందర్శించింది. ఈ మేరకు ఆయా పాఠశాలలో వసతులు పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తుల ఆధారంగా మొత్తం 50 పాఠశాలలను పీఎం శ్రీ పథకానికి ఎంపిక చేసింది. పీఎం శ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలల్లో స్మార్ట్ క్లాసులు, లైబ్రరీ, క్రీడా సదుపాయాలు, గుణాత్మక విద్య వంటి కార్యక్రమాలు అమలు చేస్తారని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు తెలిపారు. దీనికి గాను ఆయా పాఠశాలల నుంచి జిల్లా విద్యాశాఖ ద్వారా కేంద్రానికి పంపాల్సి ఉంటుందని, కేంద్రం నుంచి 60 శాతం గ్రాంటు విడుదలవుతుందని, మిగిలింది రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు.

ఉత్తమ పంచాయతీగా పడమర పెద్దివారిపాలెం

సోషియల్లీ సెక్యూర్డ్ పంచాయతీ కేటగిరిలో ఎంపిక


అవార్డు అందుకుంటున్న సర్పంచ్ అప్పయ్యచౌదరి

యద్దనపూడి: రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా పడమర పెద్దివారిపాలెం గ్రామపంచాయతీ ఎంపికైంది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం తాడేపల్లిలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ కమిషనర్ సూర్యకుమారి, అడిషనల్ కమిషనర్ సుధాకర్, కమిషనర్ సూర్యనారాయణ చేతుల మీదుగా సర్పంచ్ కొడవలి అప్పయ్యచౌదరి పురస్కారాన్ని అందుకున్నారు. మండలంలో మొదటిసారిగా సోషియల్లీ సెక్యూర్డ్ పంచాయతీగా ఎంపికవడంపై ఎంపీడీఓ కృష్ణకుమారి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు.

తీవ్ర జ్వరం.. నివారణే పరిష్కారం

- సోకితే వదలదు.. ఎటూ కదలనీయదు
- మలేరియాపై అప్రమత్తత అవసరం
- దోమకాటు ద్వారా వ్యాప్తి
- నేడు వరల్డ్ మలేరియా డే



మలేరియాపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు మెడికల్: మలేరియా ఈ పేరు చెబితేనే చాలా మంది ప్రజలు వణికిపోతారు. నెలల తరబడి జ్వరం పీడిస్తూ ఉండటమే కారణం. వ్యాధి సోకిదంటే ఒక పట్టాన త్వరగా శరీరాన్ని వదిలిపోదు. ప్రతి ఏడాది అనేక లక్షల మంది దీని బారిన పడుతున్నారు. మలేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 2007లో వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ఏప్రిల్ 25వ తేదీని వరల్డ్ మలేరియాడే గా నిర్ధారించింది. 2007 నుంచి ప్రతి ఏడాది ఏప్రిల్ 25న దీనిని నిర్వహిస్తున్నారు.

మలేరియా లక్షణాలు...
ఈ వ్యాధి అనాఫిలిస్ దోమకాటు వల్ల వస్తోంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, మూత్రం మందగించటం, కడుపులో నొప్పి, జ్వరం మూడురోజులకొకసారి లేదా రెండురోజులకొకసారి లేదా రోజుమార్చి రోజు వస్తూ ఉండటం దీని లక్షణాలు. సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స చేయని పక్షంలో నెలల తరబడి వ్యాధి పీడిస్తోంది. కొందరిలో సెరిబ్రల్ మలేరియా, వైవ్యాక్స్ మలేరియాలు కూడా వస్తాయి. ఈ వ్యాధులు సోకిన వారిలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోవటం, కామెర్లు పెరిగిపోవటం, నిమోనియా, ఫిట్స్, మూత్రపిండాలు చెడిపోవటం, స్పృహ కోల్పోవడం జరుగుతుంది. మలేరియా ఉన్న వ్యక్తి రక్తం ఎక్కించటం ద్వారా, మలేరియా వ్యాధి ఉన్న వ్యక్తిని కుట్టిన దోమ ఇతరుల్ని కుట్టటం ద్వారా సోకుతోంది.

నిర్ధారణ....
జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. రక్తపు పూతలు సేకరించి వ్యాధి నిర్ధారణ జరిగితే క్లోరోక్విన్, ప్రై మాక్సిన్ అనే మాత్రలను ఇస్తారు. ఇవి 14 రోజులు ఆపకుండా తప్పని సరిగా వాడాలి. ఈ మందులన్నీ కూడా ఉచితంగా అందిస్తారు. కొన్ని సందర్భాల్లో వైద్య సిబ్బంది ఇళ్లకు వెళ్లి రక్తపు పూతలు సేకరిస్తారు. పూర్వం కేవలం ఐదు రోజుల మందులు వాడితే సరిపోయేది. కాని న్యూడ్రగ్‌పాలసీ 2012 ప్రకారం తప్పని సరిగా 14 రోజులు వాడాలి.

మలేరియాను తరిమికొడదాం..
గుంటూరు వెస్ట్: మలేరియా వ్యాధిని సంపూర్ణంగా సమాజం నుంచి తరిమికొట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జేసీ జి.రాజకుమారి, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం ప్రపంచ మలేరియా దినాన్ని పురస్కరించుకుని ర్యాలీని నిర్వహించడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 2030 నాటికి దేశం నుంచి మలేరియాను సాగనంపుదామని పేర్కొన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటరామిరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్ బాబు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

జిల్లాలో మలేరియా జ్వరం 2022లో 24 మందికి సోకింది. వీటిల్లో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 22, ప్రత్తిపాడులో ఒకటి, తాడికొండలో ఒకటి చొప్పున కేసులు వచ్చాయి. 2023లో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నాలుగు, తెనాలిలో ఒకటి మొత్తం ఐదు మలేరియా కేసులు నమోదయ్యాయి. మలేరియా డే సందర్భంగా ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు మంగళవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నాం.

– జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం

దోమ కాటు వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..
దోమ కాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, ఇతర జ్వరాలకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. దోమల ద్వారా మలేరియా సోకుతుంది కాబట్టి ఇంటి పరిసరాలలో దోమలు పెరిగేందుకు ఆస్కారం లేకుండా మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. దోమతెరలు వాడటం ద్వారా దోమకాటు బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

పోలీసులకు సబ్సిడీపై నిత్యావసరాలు


వస్తువులు పరిశీలిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: పల్నాడు జిల్లా పోలీసులకు అత్యంత నాణ్యతా ప్రమాణాలు కలిగిన నిత్యావసర సరుకులను సబ్సిడీపై అందించటమే ధ్యేయంగా క్యాంటీన్ ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నిత్యవసరాల సబ్సిడీ క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ నూతన జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సౌకర్యాల లేమితో ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ఈ సబ్సిడీ క్యాంటీన్ ప్రారంభించామని తెలిపారు. ఇక్కడ నిత్యావసర సరకులతోపాటు ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ట్రావెల్ బ్యాగులు, ఇతర వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. ఎప్పటికప్పుడు అన్ని సరకులను అందుబాటులో ఉంచాలని పోలీస్ సంక్షేమ అధికారి వెంకటరమణను ఆదేశించారు. క్యాంటీన్‌లో ఉంచిన నిత్యావసర సరుకులను పరిశీలించి ఎల్లప్పుడూ తాజాగా ఉండటానికి కావలసిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ ఏఆర్ రామచంద్రరాజు, డీఎస్పీలు, ఏఆర్ డీఎస్పీ, సీఐలు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి చెన్నుపాటి

- రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ నేతగా.. రచయితగా పేరు ప్రఖ్యాతులు
- అవార్డులు, రివార్డులు, ప్రశంసాపత్రాలు


చిననాగయ్య పురస్కారం అందుకుంటున్న చెన్నుపాటి

అద్దంకి: అనుకున్నది ఏదైనా సరే పూర్తిచేసే వరకు నిద్రపోని నైజం ఆయనది. జన్మించింది కుగ్రామంలోనైనా బాగా చదవి తెలుగు ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాడు. సమితి నుంచి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర నేతగా, ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడిగా పనిచేశాడు. మలివయసులో పేద విద్యార్థులను చదివిస్తూ సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. సమకాలీన సమాజంలోని మంచిచెడులను ఎత్తి చూపే పద్యాలతో శతకాలు, ఖండకావ్యాలు రచించి పలు అవార్డులు ప్రశంసాపత్రాలు అందుకున్నాడు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన రామలింగయ్య, బసవమ్మ కుమారుడు చెన్నుపాటి రామాంజనేయులు. ప్రాథమిక విద్యను అద్దంకిలో పూర్తి చేశాడు. తరువాత తిరుపతిలో విద్వాన్, ప్రొద్దుటూరులో పండిత శిక్షణ, వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎంఏ, బీఈడీ చేశాడు. వామపక్ష భావజాలం కలి గిన రామాంజనేయులు 1976లో మద్దిపాడు మండలంలోని మద్దిరాలపాడు ఎయిడెడ్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా, హెచ్ఎంగా 2010 మే వరకు పనిచేసి రిటైర్ అయ్యారు.

అంచెలంచెలుగా నేతగా ఎదిగి..
1981 మద్దిపాడు ఏపీటీఎఫ్ సమితి శాఖ ప్రధాన కార్యదర్శిగా ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి 1997 ప్రకాశం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శిగా, 1987 రాష్ట్ర కౌన్సిలర్‌గా 2004 రాష్ట్ర కార్యదర్శిగా ఉపాధ్యాయ పత్రిక ఎడిటర్‌గా 2010 వరకు పచిచేశారు. 2007లో అప్పటి ప్రభుత్వం రామాంజనేయులుకు జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ప్రకటించినా దానిని తిరస్కరించారు. పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయకుండా తనకు అవార్డు వద్దంటూ తిరస్కరించాడు.

రచనలు, అవార్డులు..
తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనుభవం, సాహిత్యంపై ఉన్న మక్కువతో రేడియోలో వచ్చే సమస్యలను పూరించి పంపేవాడు. ఉపాధ్యాయ పత్రికకు సామాజిక అంశాలపై కవితలు రాసేవారు. 2018లో మొదటగా చెన్నుపాటి పద్య శతకాన్ని రాశారు. 2020లో నా జీవనయానం 1042 పద్యాలతో స్వీయ చరిత్ర రాసుకున్నారు. దీనికి కృష్ణా జిల్లా తిరువూరులో జీవిత చరిత్ర విభాగంలో స్వాతంత్ర్య సమరయోధుడు నాగయ్య పురస్కారం అవార్డు లభించింది. కరోనా విజృంభించిన సమయంలో సమాజంలో చైతన్యం కోసం కల్లోల కరోనా శతకాన్ని రాశారు. గీతికా కదంబమనే ఖండ కావ్యం, అమ్మ వచన కవితా సంకలనం, నేటి దృశ్యం పద్య కవితా సంకలనం దేశంలో జరుగుతున్న ఘటనల ఆధారంగా స్పందించి వాటికి పద్య రూపం కల్పించారు. రెండు పాటలు రచించారు. 1973లోనే నాటి బండారు రామారావు స్ఫూర్తితో కాటిసీను రెండుసార్లు ఏకపాత్ర అద్భుతంగా చేశారు. మే 21న వర్తమానం పద్య కావ్యం ఆవిష్కరణ జరపనున్నారు. ఈయనకు చీరాలలో వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ పోలవరపు జగదీశ్వరావు సాహితీ పురస్కారం, పేర్నమిట్ట సుబ్బయ్య పాఠశాలలో గురుపూజోత్సవ సందర్భంగా సన్మానం, ఇంకా ఎన్నెన్నో సత్కారాలు అందుకున్నారు. ఆరేళ్ల నుంచి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇంటర్ చదువుకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. కళాకారులకు చీరలు, తల్లి వర్ధంతి సందర్భంగా ప్రతిఏటా సేవా కార్యక్రమాలు, సాహితీసభ కార్యక్రమాల్లో పాల్గొనడం, తల్లిదండ్రుల పేరుతో ఇతోధికంగా విరాళాలు ఇస్తూ సమాజ సేవ, మరోవైపు సాహిత్య సేవచేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు చెన్నుపాటి.

వైభవంగా ఢిల్లీ తిరునాళ్లు

దేశంలో ఒకటి శ్రీపెరుంబదూర్, రెండు చీరాలలోనే


ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి

చీరాలఅర్బన్: వైష్ణవ సంప్రదాయవాదులైన పట్టుశాలీయులు ప్రతిఏటా వైశాఖ శుద్ధ చవితి రోజున జరుపుకొనే ఢిల్లీ తిరునాళ్లను సోమవారం స్థానిక దర్బార్ రోడ్డులో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక సంతబజారులోని పాండురంగ స్వామి ఆలయం నుంచి రంగనాథస్వామివారిని ఊరేగింపుగా దర్బార్ రోడ్‌లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లల్లోకి మేళతాళాలతో, బాణసంచాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. రామానుజాచార్యుల విగ్రహానికి అత్యంత భక్తిశద్ధలతో పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా దర్బారు రోడ్డు పొడవునా బొమ్మల అంగళ్లు ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాన్ని ఉడయవర్లుస్వామి దేవస్థాన, శాలిహోత్ర మహర్షిస్వామి వారి దేవస్థాన కమిటీలు, పట్టుశాలి సంఘం వారు నిర్వహిస్తున్నారు. చీరాల, పరిసర ప్రాంతాలలోని పట్టుశాలీలు తరతరాలుగా ప్రతిఏటా అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా, క్రమం తప్పకుండా వేడుకలు నిర్వహిస్తున్నారు. చీరాలలోని వీరరాఘవపేటలోని మెయిన్‌రోడ్డులో ఈ ఉత్సవం నిర్వహించడం వలన ఈ రోడ్డును 'దర్బార్‌రోడ్డు'గా పిలుస్తారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఎస్పీ వకుల్‌జిందాల్
- స్పందనలో అర్జీల స్వీకరణ


వృద్ధురాలి సమస్య వింటున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్‌: స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 46 మంది ఎస్పీ కార్యాలయానికి చేరుకొని తమ సమస్యలపై ఎస్పీకి అర్జీలు అందించారు. బాధితుల సమస్యలు విన్న ఎస్పీ వకుల్‌జిందాల్ సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చూడాలని ఆదేశాలు జారీచేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ స్పందన అర్జీలు మళ్లీమళ్లీ పునరావృతం కాకుండా సంతృప్తికర స్థాయిలో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్పందన కార్యక్రమానికి అందే అర్జీలు నిర్ణీత గడువులోపు చట్టపరిధిలో పరిష్కరించాలన్నారు. వరకట్నం వేధింపులు, కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, ఆర్థిక పరమైన లావాదేవీల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డీసీఆర్‌డీ డీఎస్పీ జి. లక్ష్మయ్య, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్నకు విశేష స్పందన

- రాష్ట్రవ్యాప్తంగా కోటి కుటుంబాలను కలిసిన పార్టీశ్రేణులు
- పీపుల్స్ సర్వేలో కూడా వైఎస్సార్‌సీపీకే మద్దతు
- ఎమ్మెల్యే కోన


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన

బాపట్ల: రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు చేపట్టిన మా నమ్మకం నువ్వే జగనన్నకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. పీపుల్స్ సర్వేలో కూడా వైఎస్సార్ సీపీకే అత్యధికంగా మద్దతు తెలిపారని వివరించారు. స్థానిక కోన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోన మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లినప్పుడు వారు చూపిన ఆదరణ ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. ప్రభుత్వం పనితీరుపై అనుకూలంగా బాపట్ల నియోజకవర్గంలో 30వేల మిస్డ్‌కాల్స్ ఇచ్చారంటే ఎంతో గొప్పవిషయమన్నారు. తాజాగా మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావటం అభినందనీయమన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే కార్యక్రమంలో పార్టీశ్రేణులు ప్రజల వద్దకు వెళ్లినప్పుడు వారు చూపే ఆదరణ ఎంతో గొప్పదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రజల్లోనే పాలకులు ఉండాలనే ఉద్దేశంతో పాలన కొనసాగించారన్నారు. అన్ని వర్గాల్లోకి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. నామినేటెడ్ పదవుల్లో సైతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. ఖచ్చితంగా రాబోయే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి వస్తుందని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు చేజర్ల నారాయణ రెడ్డి, షేక్ సయ్యద్‌పీర్, ఇనగలూరి మాల్యాద్రి, గవిని కృష్ణమూర్తి, సుమన్‌రెడ్డి, మోర్ల సముద్రాలగౌడ్, పిట్ల వేణుగోపాల్ రెడ్డి, గేరా మణిభూషన్ పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు


అవార్డు అందుకుంటున్న అమర్తలూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ డి.రాము


భట్టిప్రోలులో ప్రశంసాపత్రాలతో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు


కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మోటుపల్లి సర్పంచ్ సాంబశివరావు

అమర్తలూరు(వేమూరు): జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా అమర్తలూరు ఎంపికైంది. బాపట్లలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా నుంచి గ్రామ సర్పంచ్ దేవరకొండ రాము అవార్డు అందుకున్నారు. 2021–2022 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలో నీటి సంవృద్ధి, సుపరిపాలనను గుర్తించి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఏడు పంచాయతీలకు అవార్డులు

భట్టిప్రోలు: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా తొమ్మిది అంశాలపై జరిగిన సర్వేలో భట్టిప్రోలు మండలంలోని ఏడు పంచాయతీలకు అవార్డులు దక్కాయి. ఇందులో ఆళ్లమూడి, కోనేటిపురం, వెల్లటూరు పంచాయతీలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. పల్లెకోన, రాచూరు, పెసర్లంక, ఓలేరు గ్రామాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయా గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరుపీధుల ఉదయభాస్కరిలు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు మేరుగ రంగారావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, చౌటూరి లక్ష్మి, ఈవోపీఆర్డీ సీహెచ్ శేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ముత్తుపల్లి సర్పంచ్‌కు అవార్డు అందిస్తున్న నిజాంపట్నం ఎంపీడీఓ నాగలక్ష్మి

జీవనభృతి కల్పనలో మేటి మోటుపల్లి పంచాయతీ

చినగంజాం: మండలంలోని మోటుపల్లి పంచాయతీ జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక కాగా సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చేతులమీదుగా సోమవారం అవార్డు అందుకున్నారు. పేదరిక నిర్మూలన, జీవనభృతి కల్పనలో పంచాయతీ ప్రతిభ కనబరచడంతో మోటుపల్లికి అవార్డును ప్రకటించారు.

ఈ మేరకు బాపట్ల జిల్లా కార్యాలయంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయనతోపాటు ఇన్‌చార్జ్ ఎంపీడీవో కేస్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి కత్తి శైలజ పాల్గొన్నారు.


గూడవల్లి సర్పంచ్ నాగేశ్వరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంపీపీ మత్తి

నిజాంపట్నం: గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లడం అభినందనీయమని ఎంపీడీవో నాగలక్ష్మి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజాంపట్నం మండలం పరిధిలోని ముత్తుపల్లి, ఆముదాలపల్లి, పల్లపట్ల పంచాయతీలకు అవార్డులను అందించారు. ఎంపీడీవో నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు సమకూర్చడం వంటి కార్యక్రమాల్లో అధికారులతో ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో భాగంగా మండలంలో మూడు పంచాయతీలకు అవార్డులు దక్కడం జరిగిందన్నారు. సర్పంచ్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఈవో పీఆర్డీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఐదు గ్రామ పంచాయతీలకు ఉత్తమ పంచాయతీ పురస్కారాలు

చెరుకుపల్లి: గ్రామ పంచాయితీలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆరోగ్యవంతమైన గ్రామంగా తీర్చిదిద్దిన సర్పంచ్‌లను సత్కరించుకోవటం అభినందనీయమని ఏంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ పేర్కొన్నారు.

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆళ్లవారిపాలెం, గూడవల్లి, నడింపల్లి, పొన్నపల్లి, ఆరుంబాక గ్రామ పంచాయతీలకు ఆరోగ్యవంతమైన పంచాయతీలుగా మండల స్థాయిలో అవార్డులను ఏంపీపీ రత్నప్రసాద్, వైస్ ఎంపీపీ పైనం రంగారెడ్డి ఎంపీడీవో శ్రీనివాసరావు ఆయా గ్రామ సర్పంచ్‌లకు సర్టిఫికెట్‌లు అందజేసి దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో సర్పంచ్‌లు కామినేని కోటేశ్వరరావు, కూరేటి శ్రీనివాసరావు, నలిగిల నాగేశ్వరరావు, పైనం బసవపున్నమ్మ, ఎమినేని సుబ్బారావు ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

నరసరావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని గురవాయపాలెం సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామానికి చెందిన చింతలపూడి జైశ్రీకర్(22) నరసరావుపేటలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి నరసరావుపేట నుంచి కోటప్పకొండ వెళ్తుండగా గురవాయపాలెం వద్ద జైశ్రీకర్ నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జైశ్రీకర్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులు

- ఐదు బంగారు, నాలుగు సిల్వర్ పతకాలు కైవసం
- వంశీకృష్ణకు రాష్ట్ర స్థాయి స్ట్రాంగ్ మెన్ టైటిల్


పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ సురేష్, రాష్ట్రస్థాయి స్ట్రాంగ్ మెన్ టైటిల్ సాధించిన వంశీకృష్ణ

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలో పల్నాడు జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో 21వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ క్రీడా పోటీలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి స్ట్రాంగ్ మెన్ టైటిల్ పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ సాధించాడు. పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులు ఐదు బంగారు పతకాలు, నాలుగు వెండి పతకాలు కైవసం చేసుకొని పల్నాడు జిల్లా ప్రతిష్ట చాటారు. సబ్ జూనియర్ విభాగంలో 53 కిలోల విభాగంలో గురజాలకు చెందిన కె.కార్తీక్ (గోల్డ్ మెడల్), 66 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన షేక్ కరీం(గోల్డ్ మెడల్) సాధించారు. జూనియర్ విభాగంలో 53 కేజీల విభాగంలో గురజాలకు చెందిన ఎం.అనుష(బంగారు పతకం), 53 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఎస్కే గౌస్(నాలుగో స్థానం), 59 కిలోల విభాగంలో సత్తెనపల్లికి చెందిన ఫ్రాన్సిస్(సిల్వర్ మెడల్), 59 కేజీల విభాగంలో సత్తెనపల్లికి చెందిన సౌరబ్(సిల్వర్ మెడల్), 66 కేజీల విభాగంలో వెన్నాదేవికి చెందిన ఎన్.శరత్ (సిల్వర్ మెడల్), 74 కిలోల విభాగంలో పసుపులేటి వంశీకృష్ణ(రెండు గోల్డ్ మెడల్స్) సాధించాడు. 74 కేజీల విభాగంలో ఎన్.ఈశ్వర్ నాలుగో స్థానం కైవసం చేసుకున్నాడు. మాస్టర్స్ విభాగంలో 105 కిలోల విభాగంలో గురజాలకు చెందిన కె.జ్యోతిబాబు(రెండు సిల్వర్ మోడల్స్) సాధించాడు. పోటీలల్లో క్రీడాకారులు ప్రతిభ చూపేందుకు పల్నాడు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ, అంతర్జాతీయ క్రీడాకారుడైన పసుపులేటి సురేష్ శిక్షణలోభాగంగా మెలుకువలు నేర్పి తర్ఫీదును అందించాడు. ప్రతిభ చూపిన క్రీడాకారులను, కోచ్‌ను ఆంధ్రప్రదేశ్ భారీ నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిమ్ రాజు, గుజ్జర్లపూడి ఆనంద్, ఎస్.మణిరత్నం, టీ శంకర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహూల్ గౌతమ్, జి రమేష్, శాంతయ్య, షేక్ జానీ, సయ్యద్ మస్తాన్ సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

నవ రసాలు పండించిన ‘నాన్న నేనొచ్చేస్తా’

- ముగిసిన కొండవీడు కళా పరిషత్ 24వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన 'నాన్న నేనొచ్చేస్తా' నాటిక
- ద్వితీయ, తృతీయ ప్రదర్శనలుగా చీకటి పువ్వు, థింక్ నాటికలు


ఉత్తమ ప్రదర్శన బహుమతి అందుకుంటున్న 'నాన్న నేనొచ్చేస్తా' నాటిక దర్శకురాలు అమృత

యడ్లపాడు: కళా సంబరం ముగిసింది. చారిత్రక ప్రసిద్ధి చెందిన కొండవీడు పేరిట లింగారావుపాలెంలో 'కొండవీటి కళా పరిషత్' కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలకు తెరపడింది. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో పోసాని సుబ్బారావు కళా వేదికపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని కళా సంస్థలు 9 కళా రూపాలు తమ ప్రదర్శనలిచ్చాయి. నవరత్నాల్లాంటి నాటికల్లో ఉత్తమ ప్రదర్శన, వ్యక్తిగత బహుమతులను కమిటీ సభ్యులు అందించి, సత్కరించారు. న్యాయ నిర్ణేతలు జీఎస్ ప్రతాప్‌రెడ్డి, శొంఠినేని కిషోర్, అంచూరి నర్సిరెడ్డి బహుమతుల వివరాలు వెల్లడించారు. పోటీల నిర్వహణను జయప్రదం చేసిన పరిషత్ సభ్యుల్ని అభినందించారు.

'నాన్న నేనొచ్చేస్తా' నాటికకు 5 బహుమతులు

గుంటి రాజేశ్వరీ మూల కథకు తాళ్ల బత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరణ చేసి, అమృతలహరి దర్శకత్వం వహించిన శ్రీ అమృతలహరి థియేటర్స్ ఆర్ట్స్ (గుంటూరు) వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతిని కైవసం చేసుకుంది. ఇదే బృందంలోని ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ అమృత వర్షిణి, ఉత్తమ సహాయ నటుడు ఎస్‌కేడీ హసన్, ఉత్తమ హాస్య నటుడు టి.వెంకటేశ్వరరావు, ఉత్తమ రచయిత టి.వెంకటేశ్వరరావుకు బహుమతులు దక్కాయి.

'చీకటి పువ్వు' నాటికకు ఐదు బహుమతులు

పరమాత్ముని శివరాం రచనకు మంచాల రమేష్ దర్శకత్వం వహించి చైతన్య కళాభారతి (కరీంనగర్) వారి నాటిక 'చీకటి పువ్వు' ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా నిలిచింది. ఇదే నాటికకు ఉత్తమ దర్శకుడు మంచాల రమేష్, ఉత్తమ సంగీత దర్శకుడు నాగరాజు, ఉత్తమ నటిగా గుడివాడ లహరి, ప్రత్యేక జ్యూరీ అవార్డును గిరిబాబు అందుకున్నారు.

'థింక్' నాటికకు నాలుగు..

మంజునాథ రచన, దర్శకత్వం వహించి సిరిమువ్వ కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) వారి నాటిక 'థింక్' ఉత్తమ తృతీయ ప్రదర్శనగా బహుమతి పొందింది. ఈ నాటికకు ఉత్తమ నటుడు సతీష్‌కుమార్, ఉత్తమ ఆహార్యం అమృత వర్షిణి, ప్రత్యేక జ్యూరీ అవార్డును వేణుగోపాల్‌కు లభించాయి.

'రైతే రాజు'కు రెండు అవార్డులు..

అలాగే కంచర్ల సూర్య ప్రకాష్ రచనకు కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన కళాంజలి (హైదరాబాద్) వారి 'రైతేరాజు' నాటిక ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనకు ఎంపిక కాగా, ఇందులో నటించిన ఏపూరి శ్రీనివాస్‌కు కూడా ప్రత్యేక జ్యూరి అవార్డు రావడం గమనార్హం. ఇవీగాక రంగాలంకరణ ఎస్.రామమోహన్‌రావు (వెండి అంచులు), ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ఎస్.వెంకటేశ్వర్లు (స్థిరాస్తి), ఉత్తమ సహాయ నటులు, జీఎస్‌డీ కుసుమ సాయి(కాపలా), ఉత్తమ విలన్ గోప రాజు విజయ్ (ప్రేమతో నాన్న), ప్రత్యేక జ్యూరీ అవార్డులను ఎస్.సూర్య(అస్థికలు), వసంతయామిని (వెండి అంచులు), ఇ.భాగ్యరాజ్(కాపలా) అందుకున్నారు.

ఈ కార్యక్రమాన్ని పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా శ్రీహరిరావు, మండెపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తోకల సాంబ శివరావు, నంబూరి వీరాంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు మల్నేని సీతారామాంజనేయులు, కనపర్తి శ్రీనివాసరావు, కోశాధికారులు కట్టా వీరాంజనేయులు, నంబూరు శివ రామకృష్ణ, సభ్యులు కావటి సాంబయ్య, నంబూరు ఉల్లయ్య, రంగస్థల, సినీ దర్శక రచయిత జరుగుల రామారావు పర్యవేక్షించారు.

అదుపు తప్పిన రొయ్యల వాహనం


మార్జిన్‌లోకి దూసుకెళ్లిన రొయ్యల వాహనం

రూ.3 లక్షల నష్టం

మార్టూరు: రొయ్య పిల్లలను తరలిస్తున్న వాహనం జాతీయ రహదారిపై అదుపు తప్పడంతో నష్టం వాటిల్లింది. అందిన వివరాల మేరకు.. సోమవారం నెల్లూరు నుంచి విజయవాడకు రొయ్య పిల్లలను తరలిస్తున్న వాహనం కోనంకి, ఇసుదరిశి గ్రామాల మధ్య పెట్రోలు బంకు ఎదురు అదుపుతప్పి మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. ప్రమాద తీవ్రతకు వాహనంలో ఉన్న రొయ్య పిల్లల సంచులు రోడ్డుపై పడి ధ్వంసం అయ్యాయి. కాగా ఎండ తీవ్రతకు రొయ్యలు చాలావరకు మృతి చెందాయి. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని వాహన డ్రైవర్ తెలిపాడు.

రాష్ట్ర 'చౌక్‌బాల్' జట్ల ఎంపిక



చిలకలూరిపేటటౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చౌక్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాల బాలికల జట్లను సోమవారం ఎంపిక చేశారు. పట్టణంలోని గ్రీన్ వ్యాలీ స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ చేబ్రోలు మహేష్ పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు మే 27 నుంచి 30 వరకు తెలంగాణలోని షాద్ నగర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి ఎస్.సుధాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్, పల్నాడు జిల్లా కార్యదర్శి వై.ఫిలిప్‌రాజు, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పురపరిపాలనా శాఖ

ఆర్.ఓ.సి. నెం. 1446/1995/ఎ1 తేది.24.04.2023

బహిరంగ వేలము ప్రకటన

మాచర్ల పురపాలక సంఘమునకు చెందిన ఐ.డి.యస్.యం.టి షాపింగ్ కాంప్లెక్స్ నందు గల షాపు రూములు 3 సంవత్సరముల కాల పరిమితితో ప్రతి 3 సంవత్సరములకు 33.33% అద్దె పెంపుదల చేయు నిబంధనలపై తేది.04.05.2023న గురువారము ఉదయం గం।। 11.00 లకు పురపాలక సంఘ కార్యాలయము నందు కమీషనరు గారిచే గానీ, వారి అనుమతి పొందిన వారిచే గానీ బహిరంగ వేలము నిర్వహించబడును. పాటలో పాల్గొనదలచిన వారు ఈ పురపాలక సంఘమునకు ఆస్తిపన్నులు గానీ, నీటి పన్నులు మరియు లోగడ పాటపాడి బకాయిలు ఉన్న యెడల ఆట్టి వ్యక్తులు పాటలో పాల్గొనుటకు అనర్హులు. వేలములో పాల్గొనదలచిన వారు స్వయముగా పాల్గొనవలెను. ఏ కారణము చూపకనే ఏ వ్యక్తినైననూ పాటలో పాల్గొనకుండా చేయుటకు కమీషనరు గారికి పూర్తి అధికారము కలదు.

పాటలో పాల్గొనదలచినవారు గజిట్ నోటిఫికేషన్ నందు ఉదహరించిన ప్రకారము సాల్వేన్సీ మరియు దరావత్తు చెల్లించవలెను. హెచ్చు పాటదారులు స్టాంపు డ్యూటీ, లీజు అగ్రిమెంట్‌ను 3 కార్యాలయ పనిదినముల లోపుగా సమర్పించవలెను. నోటిఫికేషన్‌లో ఉదహరించిన నిబంధనలను పాటించవలెను. ఇతర వివరముల కొరకు కార్యాలయ పనివేళల యందు సంప్రదించవలెను.

సం/- కమీషనరు, మాచర్ల పురపాలక సంఘము